GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్


మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్

ఏజెంట్లు కావలెను

కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.

అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.

వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.

GSTIN:36FDKPS1308P1ZX

Spot Speed NEWS

టి-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in YouTube facebook



సంపుటి : 7 | సంచిక : 319 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 28.05.2025 | పేజీలు : 3


# రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు




- గ్రామాల్లో రైతు సదస్సుల నిర్వహణ
- సాగు ఖర్చులు తగ్గించుకోవడంపై అవగాహన

**టి మీడియా, మే 27, హైదరాబాద్ బ్యూరో**

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోన్న తరుణంలో తొలిసారిగా రైతుల వద్దకే శాస్త్రవేత్తలను పంపిస్తోంది. 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం' పేరుతో పంటల సాగులో మెళకువులు, సహా అనేక సూచనలు రైతులకు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి రైతు సదస్సులు నిర్వహిస్తున్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, రసాయ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంపై సలహాలు ఇస్తున్నారు.ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా : వర్షాకాలం ఈసారి ముందుగానే మొదలైంది. ప్రతిసారి మాదిరిగానే రైతులు తమ పొలాలను చదును చేశారు. ఈ నేపథ్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా పంట దిగుబడి పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.రైతులను చైతన్యపరుస్తూ : నకిలీ విత్తనాలు, మోతాదుకు మించి ఎరువులు వాడకుండా రైతులకు ఆదాయం పెంచే మార్గాలను శాస్త్రవేత్తలు రైతులకు చెబుతుతున్నారు. మే 5న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 13 వరకు జరుగుతుంది. ఇందులో భాగంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువులు, పురుగుమందులు తగ్గించడం, సాగునీటి ఆదా, పర్యావరణ పరిరక్షణ, ఇతర సామాజిక అంశాలపై రైతులను చైతన్యపరుస్తున్నారు.రాష్ట్రంలోని సుమారు 1200 రెవెన్యూ గ్రామాల్లో 400 మంది శాస్త్రవేత్తలు పలు బృందాలుగా ఏర్పడి పర్యటిస్తున్నారు. దక్షిణ వ్యవసాయ మండలాల్లో సుమారు 100 మంది శాస్త్రవేత్తల బృందాలు పర్యటిస్తున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 చొప్పున శాస్త్రవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో అన్నదాతలతో మమేకం అవుతున్నారు.రైతులు సంప్రదాయ వ్యవసాయం చేసుకుంటూనే వారి జీవనాన్ని గడుపుతున్నారు. అనుభవజ్ఞులైన రైతులు, శాస్త్రవేత్తలు కలిసి వారి ఆలోచనలు పంచుకుంటే వ్యవసాయంలో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. శాస్త్రవేత్తలు, విద్యార్థులు గ్రామాల్లో పర్యటించి పంటలపై చేసిన ప్రయోగాల వల్ల సాధించిన ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నారు" – తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రిప్రతి బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వెయ్యి మంది వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొంటున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో పలు వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాలలు, పరిశోధన సంస్థలు, కృషి విజ్ఞాన, ఏరువాక కేంద్రాలు భాగమవ్వడం విశేషం.





రైతులు పడుతున్న ఇబ్బందులు, పంట దిగుబడి, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాటిని పరిష్కరించేలా తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

**గ్రామ రైతులతో భేటీ**

రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 8 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతోంది. ముందుగానే ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతు వేదికలు లేదా వెసులుబాటు కలిగిన ప్రదేశాల్లో శాస్త్రవేత్తల బృందం గ్రామ రైతులతో భేటీ అవుతోంది. రసాయనాల కారణంగా నేల ఆరోగ్యం దెబ్బతిని భూసారంపై ప్రభావం పడుతుందని అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు.పంట నష్టం నుంచి రైతులు బయటపడేందుకు నాణ్యమైన విత్తనాలను అధీకృత డీలర్ వద్ద కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. సాగునీరు, ఉచిత విద్యుత్‌ను అవసరం మేర వాడుకోవాలని చెబుతున్నారు. ఎక్కువ సార్లు ఒకే పంట వేయకుండా పంటమార్పిడి విధానాలను అవలంబించాలని అన్నదాతలను కోరుతున్నారు.

**రైతుల నుంచి విశేష స్పందన**

ప్రతి గ్రామంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, మరో ఇద్దరు పి.జి., పిహెచ్.డి. వ్యవసాయ విద్యార్థులు, క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులతో కూడిన బృందం పర్యటిస్తోంది. గ్రామాల్లో రైతుల నుంచి విశేష స్పందన వస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతుల నుంచి పంటల బీమా విత్తనాలు, మార్కెటింగ్ సమస్యలు తెలుసుకుంటున్నట్లు వివరించారు. రైతులు పంట మార్పిడిలో భాగంగా పామాయల్ సహా ఇతరత్రా పంటలు వేయాలని సూచించారు. 12వందల గ్రామాల్లో 40వేల మంది రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

# సారొస్తారొస్తారా...?

## కమిషన్ ముందుహాజరయ్యేనా..?

**టి మీడియా, మే 27,హైదరాబాద్ బ్యూరో**

సారొస్తారొస్తారా..? మరోసారి ఈ ప్రశ్న తెరపైకి వచ్చింది. విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5 .. డేట్ కూడా ఫిక్స్ అయింది. అప్పటి మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్ కూడా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది కమిషన్. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. జస్టిస్ PC ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకుంది. ఈ చివరి దశలో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. జూన్ 5న కేసీఆర్, జూన్ 6న ఈటెల రాజేందర్, చివరగా జూన్ 9న హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.నోటీసు అందుకున్న అప్పటి నుంచి పార్టీలో కాళేశ్వరం కమిషన్ ముందుకు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది. ఇప్పటికీ కెసిఆర్ ఫామ్ హౌస్ లో చాలాసార్లు దీనిపై చర్చించారు. పార్టీతో పాటు న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సలహాలు తీసుకున్నారు. గతంలో విద్యుత్ కొనుగోళ్లపై వేసిన కమిషన్ పై నోటీసు అందుకున్న కేసీఆర్ చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. కమిషన్‌కు లేఖ రాస్తూ కమిషన్ ఏర్పాటు, కమిషన్ గా ఉన్న జస్టిస్ నరసింహారెడ్డి అక్కడ కొనసాగడం తప్పంటూ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు మాత్రం ఆ పంథాలో వెళ్లకూడదని భావిస్తున్నట్లు తెలిసింది.అయితే నిజానికి పోయిన ఏడాది అసెంబ్లీలో కాళేశ్వరంపై కావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించుకోండి అంటూ సవాల్ విసిరిందే బీఆర్ఎస్. తీరా ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత హాజరు కాకపోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, కమిషన్‌ను గౌరవించకపోతే అది బీఆర్ఎస్ పై దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. హాజరైతే ప్రజల్లో సింపతీ పెరుగుతుందని, ప్రభుత్వం కావాలనే కక్ష గట్టి విచారణలకు తిప్పుతుందని సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. మొత్తానికి మొదటిసారిగా ఓ విచారణకు గులాబీ దళపతి హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు పార్టీలో గంభీర వాతావరణం కనిపిస్తుంది. జూన్ 5 బిగ్ డే అంటూ చర్చిస్తున్నారు కార్యకర్తలు.ఇక కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టులను డీల్ చేసిన అధికారులు సోమేష్‌కుమార్, స్మిత సబర్వాల్, రజత్‌కుమార్ వంటి వారిని బహిరంగ విచారణకు పిలిచింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు, కాళేశ్వరంగా రూపాంతరం చెందడం మొదలు, ప్రాజెక్టు డిజైన్‌లు, అనుమతులు, నిధులకు సంబంధించిన కీలక సమాచారాన్ని రికార్డు చేసింది. ముఖ్య ప్రాజెక్టు వ్యయాన్ని లక్ష కోట్లకు పెంచడంపై ఆరా తీసింది. నిర్మాణం పూర్తి కాకుండానే బకాయిల చెల్లింపుపై కూడా కూపీలాగింది.ఈ సమాచారాన్ని క్రోడికరించిన పీసీ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వ హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఆ క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి. ఇక, మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీష్‌రావు, ఈటల విచారణకు సంబంధించి ఇప్పటికే కొశ్చనరీ సిద్ధమైందా? టెక్నికల్ అంశాలతో పాటు నిధుల వ్యవహారంపై కూడా కమిషన్ ప్రధానంగా ఫోకస్ చేసిందా?. నోటీసులపై బీఆర్ ఎస్, ముఖ్యంగా కేసీఆర్ స్ట్రాటెజీ ఎలా వుండబోతుందన్నది చర్చగా మారింది.



# మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత

## సీఎం సహా రాజకీయ ప్రముఖుల సంతాపం



**టి మీడియా, మే 27, హైదరాబాద్ బ్యూరో:**

ఖమ్మం జిల్లా రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది. వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బానోత్ మదన్ లాల్ గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది.

**పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి**

మదన్?లాల్ రాజకీయ ప్రస్థానం 2014 అసెంబ్లీ ఎన్నికలతో మొదలైంది. వైరా నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారిన తర్వాత ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన పార్టీకి విధేయుడిగా కొనసాగారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున వైరా నుంచి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. అయినప్పటికీ, పార్టీ ఆయనపై నమ్మకం ఉంచి, వైరా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన నిరంతరం కృషి చేశారు.

**సీఎం సంతాపం**

మదన్‌లాల్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు సంతాపం తెలిపారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు అనుబంధాన్ని మంత్రి పొంగులేటి గుర్తుచేసుకున్నారు. వైరా నియోజకవర్గ ప్రజలు నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయారని తుమ్మల అన్నారు.

**కేసీఆర్, కేటీఆర్ సంతాపం**

బానోత్ మదన్?లాల్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మదన్ లాల్ మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని కేసీఆర్ అన్నారు. మదన్ లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కేసీఆర్, శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మదన్‌లాల్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా నాయకుడిగా, ఎమ్మెల్యేగా వైరా నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలందించిన మదన్ లాల్ మరణం పార్టీకి, ముఖ్యంగా గిరిజన, బడుగు, బలహీన వర్గ ప్రజలకు తీరని లోటు అని కేటీఆర్ అన్నారు.

# పీక కోస్తున్నా జై తెలుగుదేశం అన్నారు

## వారి స్ఫూర్తే నడిపిస్తోంది : సీఎం చంద్రబాబు

### మహానాడులో ప్రసంగించిన సీఎం చంద్రబాబు



**టి మీడియా, మే 27,కడప :**

రాష్ట్రానికి దశ దిశ కడప మహానాడు అని తెలుగుదేశం అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల పోరాటం, త్యాగాలే నేటి అధికారానికి కారణమని అన్నారు. పార్టీ పనైపోయిందన్న వాళ్ల పనైపోయిందే తప్ప తెలుగుదేశం జెండా రెపరేపలాడుతూనే ఉందని చెప్పారు. ఎన్నికల్లో జనసేన, బీజేపీల సహకారం మరువలేమని వెల్లడించారు. కార్యకర్తల త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరించటంతో పాటు పోరాడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. మహానాడు వేదికగా సిద్ధాంతాలు, విధానాలు, ఆలోచనలు పంచుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. దేవుడి గడప కడపలో జరిపే తొలి మహానాడు చరిత్ర సృష్టించబోతోందని అన్నారు. కడపలో 10కి 7 అసెంబ్లీ స్థానాలు గెలిచి సత్తా చాటామని ఈసారి మరింత కష్టపడి క్లీన్ స్వీప్ చేద్దామని పిలుపునిచ్చారు.అవినీతిపై రాజీలేని పోరాటం: రాష్ట్రంలో నేరస్తులకు చోటు ఉండదని మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు తెలిపారు. రాజకీయ అవినీతిని తెలుగుదేశం పట్టించుకోదనే అపోహ వద్దని, ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ప్రభుత్వానిదని తేల్చిచెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ అవినీతిపై పారదర్శకంగా విచారణ జరుగుతోందన్నారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యత ప్రజలు మనకు ఇచ్చారని శిక్ష ఆలస్యం కావొచ్చు కానీ అక్రమార్కులు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. 1989 నుంచి అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తున్నామని గుర్తుచేశారు. ఓబుళాపురం అక్రమ మైనింగ్, రాజా ఆఫ్ కరప్షన్ అంశాల్లో తెలుగుదేశం పోరాటం నిజమని న్యాయస్థానాల్లో రుజువైందని చెప్పారు. అవినీతిపరుల భరతం పడుతూనే వచ్చే పదేళ్లలో చేపట్టే విధానాలను ఆటో పైలట్?లో పెట్టి తెలుగు జాతిని నెంబర్1 స్థానంలో ఉంచుతామని హామీ ఇచ్చారు.అన్ని పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీ నాయకులే: దేశంలోని అనేక రాజకీయ పార్టీల్లో తెలుగుదేశం యూనివర్సిటీ నాయకులే ఉన్నారని సీఎం అన్నారు. బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తెచ్చిన పార్టీ తెలుగుదేశమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో

మిగతా 3లో..

# హైడ్రా రంగంలోకి దిగింది

## సర్కారు బడికి దారొచ్చింది

**టిమీడియా, మే27, హైదరాబాద్ :**

కొన్ని నెలలుగా హైదరాబాద్‌లోని చిలకలగూడ దూద్?బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చే దారి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బడికి బాట కోసం అడ్డుగా ఉన్న గోడను తొలగించాలని ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి ఎన్నోసార్లు సంబంధిత అధికారులను కలిసి విజ్ఞప్తి చేసి, ఎన్నో వినతులు సమర్పించుకున్నారు. అయినా కూడా పని జరగలేదు. ఈ సమస్యపై గత 10 నెలలుగా తిరుగుతున్నాను. అయినా కూడా ఏ అధికారి స్పందించలేదు. దీంతో చేసేదేమి లేక ప్లకార్డు పట్టుకుని జీహెచ్?ఎంసీ సికింద్రాబాద్ జోనల్? కమిషనర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టాం. ఈ సమస్యను ఈటీవీ ప్రత్యేకంగా ప్రసారం చేసి సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు" -మల్లికార్జున్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



### హైడ్రా సిబ్బంది

సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దారి లేకపోవడంపై ఈటీవీలో ప్రసారమైన 'బడికి బాటేది' కథనంపై అధికారులు స్పందించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో ఇన్?స్పెక్టర్ ఆదిత్య క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ పాఠశాలకు వెళ్లే మార్గంలో అక్కడి నివాసితులు అడ్డంగా నిర్మించిన ప్రహరిని తొలగించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్?తోపాటు హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకొని కాలనీ వాసులకు సర్దిచెప్పి పాఠశాల దారికి అడ్డంగా ఉన్న ప్రహరి గోడను కూల్చివేశారు.

### ఇరుకైన గల్లీల నుంచి

ఆ ప్రదేశంలో గేటు ఏర్పాటు చేస్తామని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. దూద్?బావి ప్రాథమిక పాఠశాలలో చుట్టుపక్కలున్న బస్తీల నుంచి సుమారు 100 మందికిపైగా పిల్లలు చదువుతున్నారు. అయితే పాఠశాలకు వచ్చేందుకు సరైన దారి లేకపోవడంతో బస్తీలో ఉన్న ఇరుకైన గల్లీల నుంచి వారు రావాల్సి వస్తోంది. వర్షాకాలం మొదలవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు తీసుకొచ్చే మధ్యాహ్నం భోజనం, అంగన్?వాడీ సరుకులు కూడా పాఠశాల లోపలికి రావడం జఠిలంగా మారింది.

### ప్లకార్డులతో నిరసన

ఏళ్ల తరబడి ఈ సమస్య వేధిస్తున్నా పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలకు అలవాటుగా మారింది. ఈ క్రమంలో ఏడాది కిందట ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్ రెడ్డి పాఠశాలకు సరైన దారి కోసం జీహెచ్ఎంసీతోపాటు ప్రజాభవన్?లోనూ అర్జీలు సమర్పించారు. కలెక్టరేట్?తోపాటు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో సోమవారం ప్లకార్డులు పట్టుకొని నిరసన దీక్ష చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఈటీవీ మల్లిఖర్జున్ రెడ్డిని కలిసి వివరాలు ఆరా తీసింది. క్షేత్ర స్థాయిలో పాఠశాలను పరిశీలించి బడికి బాటేది పేరుతో కథనాన్ని ప్రసారం చేసింది. ఆ కథనాన్ని చూసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాఠశాలకు అడ్డుగా ఉన్న గోడను తొలగించి పిల్లలు రావడానికి సరైన దారిని ఏర్పాటు చేశారు.



## భాజపా తీరంగా బైక్ యాత్ర

**టీ మీడియా మే 27:ఎండపల్లి,**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షులు రావు హన్మంతరావు అధ్వర్యంలో మంగళవారం పహల్గం ఉగ్రదాడిని ఖండిస్తూ భారత త్రివిధ దళాల సైన్యానికి మద్దతుగా భాజపా నాయకులు తీరంగా బైక్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ. పాకిస్తాన్ దేశం ఉగ్రవాధులను పెంచి పోసిస్తున్న స్థావరాలను మన మిలటరీ దలాలు నేలమట్టం చేసిన సందర్భంగా భారత సింధూర్ విజయానికి మద్దతుగా మండలంలోని అంబార్ పేట స్టేజి నుండి రాజారాంపల్లి వివేకానంద స్వామి విగ్రహం వరకు తీరంగా జెండా లతో బైక్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు,ఎండపల్లి మండల అధ్యక్షులు రావు హన్మంతరావు,ఉప అధ్యక్షుడు గొపినేని గంగచలం,ప్రధాన కార్యదర్శి పొన్నం నరేష్,మంచుకట్ల రవి,సోషల్ మీడియా కన్వీనర్ జెల్ల శ్రీనివాస్,భాస్కర్,సిగిరి ఆనంద్,అంజి,వెంకటేష్ కిరణ్,నారాయణ, ఉప్పులేటినగేష్,రవి,తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై గేదె మృతి



- తొలగించే నాథుడే లేడు

**టీ మీడియా, మే 27,ధర్మపురి:**

రాయపట్నం ఇప్పలపల్లి స్టేజి నుండి హెచ్ పి పెట్రోల్ బంకు మధ్యలో రోడ్డు పై గేదె మృతి చెంది సుమారు వారం రోజులు గడుస్తుంది.మృతి చెందిన గేదె వాహన దారులకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటి వరకు గ్రామపంచాయతీ సిబ్బంది గాని రోడ్డు భద్రత అధికారులు గాని ఎవరు కూడా పట్టించుకోకపోవడం విస్మయంగా ఉంది. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పై వున్న మృతి చెందిన గేదెను వెంటనే తొలగించాలని వాహనదారులు,గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

**టీ మీడియా, మే 27, వనపర్తి బ్యూరో :**



జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి వాకిటి శ్రీధర్, బొలమోని నరసింహ తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని జింఖానా గ్రౌండ్స్ లో జూన్ 1 న జరుగబోయే 11 వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కొరకై జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్స్ వనపర్తి లోని డాక్టర్ బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో ఈ నెల 28 వ తేదీన ( బుధవారం ) నిర్వహించనున్నామని అందుకు క్రీడాకారులు సిద్ధంగా ఉండాలని, ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయగలరని తెలిపారు. అండర్-8 బాల బాలికలు02.06.2017 %ు% 01.06.2019 మధ్య జన్మించిన వారు అర్హులు. అండర్-10 బాల బాలికలు 2.06.2015 %ు% 01.06.2017 మధ్య జన్మించిన వారు అర్హులు.

అండర్- 12 బాల బాలికలు 02.06.2013 %ు% 01.06.2015 మధ్య జన్మించిన వారు అర్హులుమిగతా వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ లు షంషీర్ అలీ 9441353375, నందిమల్ల శ్రీకాంత్ 8096115222 లను సంప్రదించగలరు.ముఖ్య గమనిక: జనన ధ్రువీకరణ పత్రాలు, కుల దృవీకరణ పత్రం లేకుండా సెలక్షన్స్ కు రావద్దు. స్టేట్ ఎంట్రీ ఫీస్ కూడా %=ం%. 150 నుండి %=ం%. 200/- కు పెంచడం జరిగిందని గమనించగలరు.



## భీం రావ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

**టీ మీడియా మే 27:ధర్మారం**

మండల కేంద్రం లొ మాత రామభాయి అంబేద్కర్ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం లో మాతా రామాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. భారతదేశ తలరాతను మార్చిన ప్రపంచ మేధావి,నవ బుద్ధుడు బోధి సత్వ బాబాసాహెబ్ అంబేద్కర్ అంతటిత్యాగమూర్తి,భార్య మాత రమాబాయి అంబేద్కర్ అని బహుజన బిడ్డల భవిష్యత్ కోసం తన పిల్లలను చంపుకొని మనమే తన పిల్లలు అనుకొని తన జీవితాన్ని దారపోసిన మహనీయురాలని ఆ మాతకు మనం ఎంతో ఋణపడి వున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ధర్మారం మండల యూత్ అధ్యక్షులు సోగాల తిరుపతి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నరసింహులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంపల్లి రాజేశం,గంధం మల్లయ్య, రేవంతన్న అభిమాని ఓరెంచిరంజీవి,గుమ్మడి శివకృష్ణ,సంతోష్,సోగాల వంశీ,బొల్లి కృష్ణ వంశీ,దేవి అనుదీప్,పవన్ యూత్ తదితరులు పాల్గొన్నారు.





## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**టీ మీడియా ,మే 27, వెల్గటూర్:**

పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనికి చేసిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్. సిబ్బంది విధి నిర్వహణ పై సమీక్షించి,స్టేషన్ శుభ్రత,రికార్డ్ విజిబుల్ పోలీసింగ్ మెరుగుపరచాలని, గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని యువత డ్రగ్స్ మత్తుపానియాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని రహదారులల్లో ప్రమాద ప్రాంతాలను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పెండింగ్ కెసులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలనిడయాల్ 100,ఫోన్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టాలని పాత నేరస్థులపై నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలొ డిఎస్పీ రఘుచందర్ సీఐ రాంనర్సింహ రెడ్డి, వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్,సతీష్ హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 2న ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ రఘునందన్ రావు

**టి మీడియా, మే 27, మెదక్ :**





మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల ఇంట్లో నుంచి మరో పార్టీ పుట్టుకొస్తుందని, జూన్ 2న బీఆర్?ఎస్? ఎమ్మెల్సీ, కేసీఆర్? కుమార్తె కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ పెడితే పక్క రాష్ట్రం మాదిరే ఇక్కడా జరుగుతుందని రఘునందన్‌రావు జోస్యం చెప్పారు.

### దేవుడు దెయ్యం ఎందుకయ్యాడు?

ఈ రాష్ట్రంలో దేవుళ్లు ఉన్నారా? దెయ్యాలు ఉన్నాయా? అనే లేనిపోని పంచాయతీలను నడుస్తున్నాయి. దేవుడు దెయ్యం ఎందుకయ్యాడు? పదేళ్లు సీఎంగా చేసినప్పుడు దేవుడు ఎందుకయ్యాడు? అని ఆయన కవితను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు భావించి పదేళ్ల తర్వాత మంచి గుణపాఠం చెప్పి ఇంట్లో కూర్చోపెడితే ఇప్పుడు ఒకరినొకరు తిట్టుకున్నట్టు చేసుకుంటున్నారని బీజేపీ ఎంపీ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో గ్రూప్ పంచాయతీలు పెట్టుకుంటున్నారని, తండ్రికి, కూతురుకు మధ్యవర్తులు ఎందుకున్నారని ప్రశ్నించారు.

### కవిత కొత్త పార్టీ

నాయకులకు తండ్రి, కుమారుడు, అల్లుడు ఎవరికీ పడకపోతే కుమార్తె దగ్గరికి పోయే విధంగా కొత్త కుంపటి పెడుతున్నారని, చెల్లి కవిత మెంటల్?గా ఫిక్స్ అయిందని సొంత ఎజెండా పెట్టుకుందామని, అక్క షర్మిల చేసినట్లు పాదయాత్ర చేద్దామని ఓ కొత్త పార్టీ కోసం ఆమె డిసైడ్ అయినట్టు కనిపిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జూన్ రెండో తేదీన కవిత కొత్త పార్టీ పెట్టె ఆలోచన కనిపిస్తుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేళ్లు పూలే విగ్రహం పెట్టడానికి చేతకాని వారే బీఆర్ఎస్ నాయకులని అన్నారు.

కుటుంబంలో ఏదో జరుగుతుంది, వాళ్లే లీడర్లు కావాలని, తండ్రి, కొడుకు, అల్లుడు వీళ్లేవెరూ నచ్చకపోతే, కుమార్తె కొత్త కుంపటి పెట్టే ప్రయత్నం జరుగుతుంది. జూన్? రెండో తారిఖున కవితమ్మ కొత్త పార్టీ పెట్టొచ్చు. పక్క రాష్ట్రంలో ఏమైందో చూసినం, ఇక్కడా అదే జరుగుతుంది" -బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

### పక్క రాష్ట్రంలో ఏం జరిగిందో

అన్నా చెల్లెలు కొత్త పార్టీ పెట్టుకుంటే పక్క రాష్ట్రంలో ఏం జరిగిందో చూసామని, ఇక్కడా అదే జరుగుతుందని రఘునందన్? రావు పేర్కొన్నారు. షర్మిల అక్క పాదాల మీదే నడిచే యాత్ర పాదయాత్ర అని ఇక్కడ కూడా అలానే ఉంటుందని అన్నారు. సామాజిక తెలంగాణలో మహిళలకు అన్యాయం జరిగిందని చెల్లి కవిత మాట్లాడితే బాధగా ఉందన్నారు. తండ్రి కేసీఆర్ క్యాబినెట్లోకి మహిళలను తీసుకోకపోతే తనకు ఎంపీ పదవి వద్దు అని చెల్లి కవిత కేసీఆర్?కు చెప్పినట్టు తాను ఎక్కడా చూడలేదని, ఒక బీసీ బిడ్డ అయిన ఈటల రాజేందర్?ను అర్ధరాత్రి మంత్రి పదవి నుంచి తొలగించి తప్పుడు కేసులు పెట్టినప్పుడు, ఇది మంచి పద్ధతి కాదని ఆమె ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అనంతరం వెంకటాయపల్లిలో పోస్ట్ ఆఫీసును ప్రారంభించి ఖాతాబుక్?లను అందచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం స్వీకరించాలి

- మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి

**టీ మీడియా, మే 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో వడ్ల సేకరణ కేంద్రాన్ని సందర్శించిన మెంటపల్లి పురుషోత్తం రెడ్డి , రైతులు వడ్ల కేంద్రానికి తెచ్చి నెలరోజులైనా తూకాం వేసి మిల్లులకు చేరవేయడంలో అధికార యంత్రాంగం విఫలమైన తీరు చందాపూర్ గ్రామంలో స్పష్టంగా కనబడుతుంది . దాదాపు నెల రోజుల నుండి రైతులు వడ్ల సేకరణ కేంద్రాలలో వడ్లు పోసి నిరీక్షిస్తున్నప్పటికీ అధికారుల సమన్వయ లోపం వల్ల, తూకాలు వేయడంలో, తూకం వేసిన సంచులను లారీలకు ఎత్తకపోవడంలో, ఎత్తిన ఒడ్లను మిల్లర్లు దింపుకోక పోవడం వల్ల, జరిగిన జాప్యం నేడు రైతులు పాలిట షరాగతంగా చందాపూర్ గ్రామంలో ఏర్పడ్డది , అకాల వర్షాల కారణంగా ఒడ్లు మొలకలు వచ్చే పరిస్థితిలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మిల్లులకు పంపిన వడ్లలో రెండు నుంచి పది కిలోల మధ్యన తరుగు కింద తగ్గించి మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తున్నారని రైతులు కొట్టుకున్న, అధికారులు పాలకులు చోద్యం చూస్తున్న విషయం చాలా హాస్యస్పదంగా ఉంది మీకు తెలిసి మిల్లర్లు తరుగు కట్ చేస్తున్నారా? లేక తెలియక కట్ చేస్తున్నారా! అధికారులు పాలకులు రైతులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా మొలకలు వచ్చిన తడిసిన ఒడ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో వాటిని త్వరగా సేకరించి తరుగు కట్ చేయకుండా రైతుకు పేమెంటు చేయవలసిందిగా మేము రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మాతోపాటు మాతో పాటు మండల బిజెపి అధ్యక్షుడు సందా వెంకటేశ్వర్లు , జిల్లా కౌన్సిల్ నెంబర్ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ, గ్రామ సీనియర్ నాయకులు పెంటయ్య గారు, వెంకటేష్ ,గ్రామ బిజెపి భూత అధ్యక్షులు. సంపత్ కుమార్ డాకేష్ తిమ్మయ్య ఎల్ల స్వామి వినోద్ రాఘవేందర్ రైతులు పరుశురాం ,పి కృష్ణయ్య, పి రామస్వామి , అంజలి రెడ్డి, నాగిరెడ్డి ,రాఘవరెడ్డి వినోద్ మన్యం, వెంకటేష్, గ్రామస్తులు , రైతులు పాల్గొనడం జరిగింది.



## ప్రతి కార్యకర్తకు పాదాభివందనాలు

- మంత్రి నారా లోకేశ్

**టి మీడియా, మే 27, కడప :**

మహానాడు సభలో ప్రసగించిన మంత్రి నారా లోకేశ్ - 6 శాసనాలను మహానాడు వేదికగా ప్రవేశపెడుతున్నట్లు వెల్లడి

: అధికారం, ప్రతిపక్షం మనకు కొత్త కాదని మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా మారాలని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. పార్టీని మరో 40 ఏళ్లు నడిపించే కీలక విధానాలకు మహానాడు వేదిక కావాలని పిలుపునిచ్చారు. తన తెలుగు కుటుంబం పేరుతో 6 శాసనాలను మహానాడు వేదికగా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు.

**6 శాసనాలు**

తెలుగుజాతి-విశ్వఖ్యాతి,యువగళం,స్త్రీ శక్తి,పేదల సేవ సోషల్ రీ ఇంజినీరింగ్,రైతులకు అండ, కార్యకర్తే అధినేత ప్రత్యేకమైన కార్యాచరణ తెలుగు జాతి విశ్వఖ్యాతి తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాపితం చేసేందుకు మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లి తెలుగువారు ఎక్కడున్నా, ఏ రంగంలో ఉన్నా నెం.1గా ఎదగాలనేది లక్ష్యమని వివరించారు. మహిళా సాధికారత, మహిళా శక్తిని చాటేలా స్త్రీశక్తి పేరుతో ఈ వర్గానికి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. పేదరికం లేని సమాజం కోసం ఇప్పటికే పీ4 విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని దీనికి అనుబంధంగా పేదరిక నిర్మూలనకు ప్రత్యేకమైన కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు.

**శాసనాలను ప్రతి ఒక్కరూ బలపరచాలి**

పార్టీలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన చర్యలు, ఐడియాలజీపై యువగళం తెస్తున్నామని తెలిపారు. రైతు లేకపోతే రాష్ట్రం లేదని సమాజమే లేదనే నినాదంతో రైతుల జీవితాలు మార్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ వెన్నుదన్నుగా నిలుస్తున్న కార్యకర్తల సంక్షేమం కోసం, వారికి చేయూత అందించేలా ఐడియాలజీ రూపొందించామన్నారు. కుల, మత, ప్రాంత అజెండాలతో అనేక పార్టీలు పుడితే తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశమని స్పష్టం చేశారు. ఈ 6 శాసనాలను ప్రతి ఒక్కరూ బలపరచాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలే నాకు నిత్య స్ఫూర్తి**

స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టిన ముహూర్త బలం గొప్పదని లోకేశ్ అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పోరాడే కార్యకర్తలు తనకు నిత్య స్ఫూర్తి అని వెల్లడించారు. ఈ రోజు నుండి ప్రారంభం అవుతున్న పసుపు పండగ మహానాడుకు అందరికీ ఘన స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన ఎక్స్‌లో విడుదల చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చెర్పించాలి

- ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్



**టీ మీడియా, మే 27, వనపర్తి బ్యూరో :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడాడు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి. మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వెసే భాద్యత మాది అన్నారు. ఈ పోటి ప్రపంచములో చదువంటే కేవలం బట్టి పట్టించి సమాధానములు వల్లెవేయడం కాదు. ఆటలు, పాటలు, మాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక పరిపక్వత తదితర అన్ని రంగాలలో తర్ఫీదు నివ్వడం ద్వారా మీ పిల్లలు ఆత్మన్యూనత భావానికి లోనూ కాకుండా పరిపూర్ణ శక్తిగా తీర్చి దిద్దబడాలి. పై పై మెరుగులకు భ్రమపడకండి. శోధించి సాధించేలా మీ పిల్లలు ఎదగాలంటే మన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాపర్ల 6వ నుంచి 10వ తరగతి వరకు, 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో మీ పిల్లలను చేర్పించగలరు. పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తే చాలు, మీపిల్లలను తీర్చి దిద్దే బాధ్యత మాది హామి ఇస్తున్నాం. వేలకు వేలు కట్టి ఇప్పుడే మీ ఆర్థిక వనరులను ధ్వంసం చేసుకోకండి. ప్రభుత్వం వారు ప్రభుత్వ బడిలో ఉదయం పూట రాగిజావ, మధ్యాహ్నం పౌష్టికాహారంతో భోజనం తెలుగు ఇంగ్లీషు మీడియం లలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే భోధన, ఎలాంటి ఫీజులు వసూలు చేయము. మీ పిల్లల భవిష్యత్ మన ప్రభుత్వ బడి యాపర్ల లో రూపుదిద్దుకుంటుందివివిధ రకాల పోటీలు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ,పదవ తరగతివిద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఉచితంగా స్నాక్స్ అందిస్తామము. ఉచిత పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్,అత్యాధునిక డిజిటల్ ప్యానెల్స్ ద్వారా భోధన, సుదూర ప్రాంతాల విద్యార్థులకు బస్ పాస్ సౌకర్యం,రవాణా ఛార్జీలు చెల్లింపు,సర్కారు . బడి మన గ్రామంలో ఉండగా,ఎక్కడో 20,30, కి.మీ సుదూర తీరాలకు ప్రైవేట్ పాఠశాలకు పంపుట ఎందుకు దండగ. దీనికీ తోడుగా మన పాఠశాలలో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ ఏర్పట్టు చేసిన్నాము. స్టూడెంట్స్ లైబ్రరీ లో కథల పుస్తకాలు, చరిత్ర పుస్తకాలు, చదవడానికి లైబ్రరీ , సైన్స్ ల్యాబ్ ద్వార విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు ఒకసారి మన ఊరి స్కూల్ ను సందర్శించండి ఆలోచించి మన గ్రామంలోని స్టూడెంట్స్ ను మన గ్రామంలోని బడిలో చేర్చండి అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బుచ్చమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషేన్, భాగ్యలక్ష్మి,ఉపాధ్యాయులు మొహినొద్దీన్ ఈశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు గోకరయ్య, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు స్వరాజ్యంబాబు రెడ్డి ,ఆదర్శ యువజన సంఘం అధ్యక్షుడు దామోదర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- దయానంద్ ముదిరాజ్



**టీ మీడియా, మే 27, వనపర్తి బ్యూరో :**

పట్టణంలో దయానంద్ ముదిరాజ్ పలు కాలనీలలో చేపట్టినటువంటి సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం చాలా హర్షించదగ్గ విషయమని రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత విషయం లో రాజీపడొద్దు. రోడ్లకు ఇరువైపులా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 17వ వార్డు నుంచి 30 వరకు ఒకే వ్యక్తికి కాంట్రాక్టు ఇవ్వడం జరిగిందని తెలుస్తుంది. పలు కాలనీలో రోడ్లకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు రోడ్లు ఎత్తు పల్లాలు రాకుండా పరిశీలించాలని రాబోయేది వర్షాకాలం కనుక పట్టణంలో పలు కాలనీ లలో సి.సి రోడ్ల నిర్మాణం చేపటాల్సి ఉందని తెలిపారు.

# ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి

**టి మీడియా, మే 27 హైదరాబాద్ బ్యూరో :**
తీర్థ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 వ తేదీ నుండి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లుటూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకి సంబందించిన వివరాలు వెల్లడించారు.



**ప్యాకేజీ 1: (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర:**
ఈ యాత్రలో (కాశీ)వారణాసి / అయోధ్య / నైమిశారణ్య / ప్రయాగరాజ్ / శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16200, 3 ఏసీ ధర 26500, 2 ఏసీ ధర 35000 ఉంటుంది. . ఈ యాత్ర సికింద్రాబాద్ ,భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, ,విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర :ఉజ్జయిని (మహాకాళేశ్వర్ %-% ఓంకారేశ్వర్) %-% త్రయంబకేశ్వర్ - భీమశంకర్ %-% ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్ / ఓంకారేశ్వర్ / త్రయంబకేశ్వర్ / భీంశంకర్ / ఘృష్ణేశ్వర్ / ఎల్లోరా / మోవ్/ నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 05 వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14700, 3 ఏసీ ధర 22900, 2 ఏసీ ధర 29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్ ముధ?డ్ మరియు పూర్ణ మీదుగా వెళ్తుంది.

**సౌకర్యాలు:**
రైలు, బస్సు, హెూటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం మరియు రాత్రి భోజనం), వాటర్ బాటిల్ మరియు టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలు లో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030712,9281495845,9281030749,9281 030750 లకు సంప్రదించాలని మరిన్ని వివరణలకు www.irctctourism.com వెబ్సైట్ ని సంప్రధించాలని తేలిపారు.

# తెలంగాణలో భారీ వర్షం

- అత్యధికంగా కరీంనగర్‌లో 11.4 సెంటీమీటర్ల

**టి మీడియా, మే 27 హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. కరీంనగర్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, మహబూబాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా కరీంనగర్ జిల్లా ఖాసింపేటలో అత్యధికంగా 11.4 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. నాంపల్లి (సిరిసిల్ల) 10.5, తిరుమలాపూర్ (జగిత్యాల) 10.1 సెంటీమీటర్లు, మల్లూరు (ములుగు)లో 9.9, ఫణిగిరి (సూర్యాపేట) 9.3 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ పేర్కొంది. గూడూరు (జనగామ)లో 8.8, జాజిరెడ్డిగూడెం (సూర్యాపేట) 8.5, మర్రిగడ్డ (సిరిసిల్ల)లో 8.4 సెంటీమీటర్లు వర్షం కురిసిందని టీజీడీపీఎస్ పేర్కొంది.ఆదిలాబాద్ అర్బన్ 7.7, మల్యాల (మహబూబాబాద్) 7.5, జైనద్ (ఆదిలాబాద్) 7.4, నిజామాబాద్ (సిరిసిల్ల)లో 7.4 సెంటీమీటర్లు, పెగడపల్లి (జగిత్యాల) 7.2, గుండాల (కొత్తగూడెం) 7.1, బొరాజ్ (ఆదిలాబాద్) 7.1, ఆవునూరు (సిరిసిల్ల) 6.9, బోయినపల్లి (సిరిసిల్ల) 6.5, పెద్దకొడపగల్ (కామారెడ్డి) 6.4, కొత్తగూడ (మహబూబాబాద్) 6.4, కిష్టారెడ్డిపేట (సంగారెడ్డి) 6.4 వర్షాపాతం నమోదైంది. మరో వైపు తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధ, గురువారాల్లోనూ పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.







## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

**టి మీడియా, మే 27 హైదరాబాద్ బ్యూరో :**
టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ అంశాలను దశల వారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని టీజీఎస్ఆర్టీసీ కళాభవన్‌లో రాష్ట్రస్థాయి ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డు సభ్యులతో యాజమాన్యం మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశానికి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆయన వెల్ఫేర్ బోర్డు సభ్యుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్‌తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామని వివరించారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలిచ్చామని వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి హెల్త్ టెస్ట్ లు చేశామని, ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వామ్యులను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందని గుర్తు చేశారు.మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన పనిభారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. ఆర్టీసీలో 3,036 రెగ్యులర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సాంకేతిక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియమకాలు కచ్చితంగా జరుగుతాయని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని అన్నారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగుల, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవని అన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగానూ, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని వివరించారు. యాజమాన్యానికి, సిబ్బందికి వెల్ఫేర్ బోర్డు సభ్యులు అనుసంధానకర్తల్లాగా పనిచేయాలని సూచించారు. ప్రతి సమస్యను పై అధికారుల దృష్టికి స్వేచ్ఛగా తీసుకురావాలన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర

- దళారులను అరికట్టాలి
- సిఐటియు, ఏపీరైతు సంఘం

**టి మీడియా,మే 27,అన్నమయ్య:**
జిల్లా, రైల్వే కోడూరు లో ప్రైవేట్ మామిడికాయల మార్కెట్ మండీలు, రైతుల పండించిన పంటలకు, ధర లేక, రైతుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, జిల్లా కలెక్టర్, ప్రభుత్వం జోక్యం చేసుకొని, గిట్టుబాటు ధర కల్పించాలని, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి పి జాన్ ప్రసాద్, ఏపీ రైతు సంఘం (ఏఐకేఎస్ )మండల కన్వీనర్, టీ. సుభాన్, కోడూరు సిఐటియు ఆఫీసులో విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కోడూరులో 70 మండిలు ఉండగా, 40 మాత్రం సరుకు కొనుగోలు, అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఇక్కడికి సరుకు, కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లోని నియోజకవర్గంలోని, ఐదు మండలాల నుండి వస్తుందన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రైవేటు మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు, దాదాపు 200 దాకా ఉన్నాయన్నారు. వారు సిండికేట్ఐ గతంలో ఉన్న ధరల కన్నా సగానికి సగం తగ్గించి వేశారని, వీటి పైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, వాటి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. నేడు పులిహోర మామిడికాయలు టన్నుఐదు వేలు రూపాయల కొనుగోలు చేస్తున్నారని, గతంలో 15 వేలరూపాయలు ఉండేదన్నారు. తోతపురి, బెంగళూరు కాయలు టన్ను 7000 కు కొనుగోలు చేస్తున్నారని, గతంలో 20 రూపాయలు కొనుగోలు చేశారన్నారు.రూమాని పది రూపాయలు, బెనిష, కిలో 15,రూపాయలు ఉందన్నారు. గతంలో 30 రూపాయలు పైన ఉండేదన్నారు. నాటు, ఆరు రూపాయలు, కొనుగోలు చేస్తున్నారన్నారు. నీలం ఇంకా కోతకు రాలేదు అన్నారు. ఫ్యాక్టరీ ధర బట్టే, వ్యాపారస్తులు బయట మార్కెట్ రెండు, నాలుగో రూపాయలు ఎక్కువ పెడతారన్నారు. ఈ ఏడాది మామిడి కాపు తక్కువ ఉందన్నారు, ధర పెరగాల్సి ఉందన్నారు. కానీ మధ్య దళారులు, ధర పెట్టడం లేదన్నారు. మండి దళారులు, రైతుల నుండి సరుకు అమ్మినందుకు, ఐదు శాతం కమిషన్ తీసుకుంటారని తెలిపారు. ఇది చాలా అన్యాయం అన్నారు. రైతుల నుండి మూడు రూపాయలు, వ్యాపారస్తులు నుండి రెండు రూపాయలు, గతంలో ఉండేదని, దాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. సూటు, తోపు పేరుతో టన్నుకి 40 కేజీలు రైతుల నుండి తీసుకొని వ్యాపారస్తులకుఇస్తు మోసం చేస్తున్నారన్నారు. మామిడి రైతు అన్ని రకాల వస్తువులు ధరల పెరిగాయి అన్నారు. ట్రాక్టర్ దుక్కెలు, కూలీలు ఖర్చులు, ఎరువులు, మందులు రైతు వాడే ట్రాక్టర్ స్పేర్ ధరల పెరగడం, జీఎస్టీ వేయడం, రైతులకు భారమైందన్నారు. తవ్వకం కూలీలు ఖర్చు,కోత కూలీలు, రోజు కూలీలు 500 ఒకరికి, సరుకు ట్రాన్స్పోర్ట్, లోడ్ చేసినందుకు కూలి ఖర్చు , టన్నుకు 350 రూపాయలు ఇవ్వాల్సిందన్నారు. మామిడి రైతు పెట్టిన పెట్టుబడి, రావడంలేదని, రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో, రైతు గిట్టుబాటు లేక, సబ్సిడీ లేక, జ్యూస్ ఫ్యాక్టరీ, యాజమాన్లు, మధ్య దళారులు,వలన దోపిడీకి గురవుతున్నారు అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మార్క్ ఫెడ్ ద్వారా, గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో మామిడి, బొప్పాయి, అరటి, ఇతర రైతుల సమస్యలపై చర్చించి న్యాయం చేయాలన్నారు. కోడూరులో మూసివేసిన అప్ప జ్యూస్ ఫ్యాక్టరీ తెరిపించాలని, ఒక భారీ పండ్ల జ్యూస్ పరిశ్రమ, ప్రభుత్వ ఆధ్వర్యంలో రైల్వే కోడూరు మండలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.




# ఘనంగా మహానాడు ప్రారంభం

- భారీగా తరలివచ్చిన శ్రేణులు

**టి మీడియా, మే 27, కడప :**
టీడీపీ పండుగ మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. కడప గడపలో జరుగుతున్న ఈ వేడుకను టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించి ప్రారంభించారు. ముఖ్య నేతలను వేదికపైకి ఆహ్వానించి చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ కోసం అసువులు బాసిన కార్యకర్తలకు మొదటగా సభా వేదిక నుంచి అంజలి ఘటించారు. పహల్గాం మృతులు, ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులకు నివాళులర్పించారు. ఇటీవల కాలంలో 1,033 మంది చనిపోయినట్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు. అంతకుముందు మహానాడు ప్రాంగణం వద్దకు వచ్చిన చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్?ను పార్టీ నేతలు ఘనంగా ఆహ్వానించారు. ప్రాంగణంలోని చిత్తూరు పార్లమెంట్ స్టాల్స్‌లో చంద్రబాబు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత మహానాడు ప్రాంగణంలో ఫొటో ఎగ్జిబిషన్?ను ఆయన తిలకించారు. టీడీ జనార్దన్, శ్రీపతి సతీష్ నేతృత్వంలో తొలిసారిగా డిజిటల్ ఫార్మాట్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంటోంది.ఇందులో ఎన్టీఆర్ అలనాటి అపురూప చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. ఫొటో ఎగ్జిబిషన్‌లో ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం, వివిధ పథకాల ప్రకటన, వివిధ ఆసక్తికర ఘట్టాలు కళ్లకడుతున్నాయి. చంద్రబాబు విద్యార్థి దశ నుంచి నాటి ప్రతిపక్ష నాయక పాత్ర వరకు చిత్రరూపంలో ఏర్పాటు చేశారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానానికి సంబంధించి ఎన్నో అరుదైన చిత్రాలు ప్రదర్శనలో ఉంచారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, లోకేశ్ యువగళం ప్రభంజన ఘట్టాలను ఇందులో ఏర్పాటు చేశారు.అదేవిధంగా మహానాడు ప్రాంగణంలో రక్తదానం , వైద్య శిబిరాలను చంద్రబాబు ప్రారంభించారు. రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి రక్తదానం చేసి చంద్రబాబు నుంచి తొలి సర్టిఫికెట్ అందుకున్నారు. రక్తదానం చేసిన వారి వద్దకు వెళ్లి ఆయన అభినందనలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడు వేడుకలో ఇవాళ, రేపు ప్రతినిధుల సభ జరగనుంది. పార్టీ మౌలిక సిద్ధాంతాలు, ఆరు సూత్రాల ఆవిష్కరణ, నియమావళి సవరణపై చర్చించనున్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ ఘన విజయం తర్వాత జరుగుతున్న తొలి మహానాడును మూడు రోజులపాటు నభూతో అన్న రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో పాలుపంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి పార్టీ నేతలు, శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు.



## విదేశీ నిధులు పొందాలంటే నిబంధనలు

- ఎన్జీఓలకు కేంద్రం కీలక ఆదేశాలు

**టిమీడియా, మే27, ఢిల్లీ :**
విదేశీ నిధులు పొందుతున్న ఎన్జీఓలకు కేంద్ర హెూం శాఖ కీలక సూచనలు చేసింది. ప్రచురణ సంబంధిత కార్యకలాపాలు నిర్వహిస్తూ విదేశీ నిధులు పొందుతున్న ఎన్జీఓలు ఎటువంటి లెటర్ హెడ్?ను ప్రచురించలేవని, అలాగే వార్తా కంటెంట్‌ను ప్రసారం చేయలేరని పేర్కొంది. ఒకవేళ వార్తా కంటెంట్?ను ప్రసారం చేయాలనుకుంటే విదేశీ నిధులు పొందుతున్న ఎన్జీఓలు భారతదేశ వార్తాపత్రిక రిజిస్ట్రార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది.




**కొత్త నియమాలు ఇవే!**
ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టం (ఎఫ్ సీఆర్ఏ) కింద రిజిస్ట్రేషన్ కోరుతున్న ఎన్జీఓలు కొత్త నియమాలను పాటించాల్సి ఉంటుందని కేంద్ర హెూం శాఖ తెలిపింది. ఎఫ్?సీఆర్ఏ నియమాలను సవరించామని పేర్కొంది. ఇక నుంచి విదేశీ నిధులు పొందడానికి అనుమతి కోరుతున్న ఎన్జీఓలు ప్రపంచ మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్సింగ్ నిఘా సంస్థ (ఎఫ్?ఏటీఎఫ్)? మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని వెల్లడించింది.

**హెూంశాఖ నోటిఫికేషన్‌లో ఏముందంటే**
విదేశీ నిధుల పొందేందుకు రిజిస్ట్రేషన్ కోరే ఎన్జీఓలు గడిచిన మూడేళ్ల ఆర్థిక, ఆడిట్ నివేదికలను జతచేయాలి. ఆస్తులు, అప్పుల ప్రకటన, రసీదులు, చెల్లింపుల ఖాతా, ఆదాయ, వ్యయ ఖాతాను అటాచ్ చేయాలి. ఆడిట్ నివేదికలు, ఆర్థిక నివేదికల్లో గత మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన కార్యకలాపాల వారీగా ఖర్చులు లేకపోతే మరో మార్గం ఉంది. ఆదాయ, వ్యయ ఖాతా, చెల్లింపు ఖాతాతో సరిపోలిన ఖర్చు చేసిన కార్యకలాపాల వారీగా మొత్తాన్ని పేర్కొనే చార్టర్డ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ సమర్పించాలి. విదేశీ నిధులు పొందుతున్న ఎన్జీఓ ప్రచురణ సంబంధిత కార్యకలాపాలలో ఉంటే విదేశీ కంట్రిబ్యూషన్ ( రెగ్యులేషన్) చట్టం 2010కి అనుగుణంగా ఉండటం గురించి ముఖ్య కార్యనిర్వాహకుడి నుంచి ఒక హామీని ఇవ్వాలి.

**హెూం శాఖ నోటిఫికేషన్ ప్రకారం**
ఎన్జీఓ గతంలో ఎఫ్?సీఆర్ఏ కింద నమోదై ఉంటే, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ గడువు ముగిసిన తర్వాత విదేశీ నిధుల రసీదు, వినియోగానికి సంబంధించిన అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో లక్ష్యాలు, వస్తువులపై ఖర్చు రూ. 15 లక్షల కంటే తక్కువగా ఉంటే, మూలధన పెట్టుబడులను చేర్చడానికి సంబంధించిన అఫిడవిట్ ఇవ్వాలి. విదేశీ విరాళాలను స్వీకరించడానికి అనుమతి కోరుతున్న ఎన్జీఓలు దాత నుంచి ఒక నిబద్ధత లేఖను కోరాలి. విదేశీ నిధులను స్వీకరించే అన్ని ఎన్జీఓలు తప్పనిసరిగా ఎఫ్ సీఆర్ఏ కింద నమోదు చేసుకోవాలి. ఫారెన్ ఫండ్స్ స్వీకరించాలనుకునే ఏదైనా సంఘం కచ్చితమైన సాంస్కృతిక, ఆర్థిక, విద్యా, మతపరమైన, సామాజిక కార్యక్రమాన్ని చేపట్టాలి. కేంద్రం నుంచి అనుమతి లేదా రిజిస్ట్రేషన్ పొందకుండా ఏ ఎన్జీఓ విదేశీ విరాళాలను స్వీకరించకూడదు.

## పీక కోస్తున్నా
### జై తెలుగుదేశం అన్నారు

తెలుగుదేశం తెచ్చిన అతిపెద్ద విప్లవం సామాజిక న్యాయమని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీని చూసే దేశంలోని అనేక రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించటం ప్రారంభించాయని చెప్పారు. దేశంలో కేంద్రం తీసుకున్న అనేక కీలక నిర్ణయాల్లో తెలుగుదేశం పాత్ర ఉందన్నారు. రాష్ట్రం ఈ రోజు ఆలోచించే విధానాలు దేశం రేపు ఆలోచిస్తుందనేది అనేక సార్లు రుజువైందని వెల్లడించారు. 2025 కడప మహానాడు సరికొత్త చరిత్ర రాసేందుకు దోహదం చేస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీకి నారా లోకేశ్? 6 శాసనాలతో బ్లూ ప్రింట్ ఇవ్వనున్నారని చెప్పారు.

**ఇబ్బందులు ఉన్నా....**
ప్రజాసేవే పరమావధిగా పని చేస్తే ఎన్నికల్లో డబ్బులు పంచాల్సిన అవసరం కూడా ఉండదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డిజిటల్ కరెన్సీ పెద్దఎత్తున వినియోగిస్తున్నందున అన్ని పెద్దనోట్లు రద్దు చేయాలనే ప్రతిపాదనకు అందరూ మద్దతు పలకాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ 6, మేనిఫెస్టో హామీలు ఎన్ని ఇబ్బందులు ఉన్నా నిలబెట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. రైతుకు ఏ ఇబ్బంది వచ్చినా ఆదుకునే చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తెలుగుజాతి నెంబర్ 1గా ఉండాలంటే తెలుగుదేశం ముందుండాలన్నారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇంకా పెంచుకోవాలని సూచించారు. చివరి మైలులో ఉన్న కార్యకర్తకు కూడా న్యాయం జరిగే పొలిటికల్ గవర్నెన్స్ అందిస్తామని హామీ ఇచ్చారు.



## మూడురోజులు భారీ నుంచి అతిభారీ వానలు

- ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

**టి మీడియా, మే 27 హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో రాగల మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని.. ప్రస్తుతం మహబూబ్‌నగర్, కావలి వరకు విస్తరించాయని.. తెలంగాణ, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఒడిశా తీరం వెంబడి వాయువ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి దక్షిణం వైపునకు వంగి ఉందని పేర్కొంది.నెమ్మదిగా ఉత్తరం వైపునకు కదిలే అవకాశాలున్నాయని.. రాబోయే 48గంటల్లో మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. తూర్పు విదర్భపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. ఇప్పుడు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొంది. ఈ క్రమంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీల వరకు తక్కువగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. నాలుగు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ కేంద్రం.

టీ-మీడియా పత్రిక
న్యూస్ వెబ్‌సైట్ కోసం
స్కాన్ చేయండి.. స్పాట్ న్యూస్
స్పీడ్‌గా తెలుసుకోండి
శనగపాటి మురళీకృష్ణ, ఇండిపెండెంట్ జర్నలిస్ట్
టీ-మీడియా (డిజిటల్) కుటుంబం
GSTIN:36FDKPS1308P1ZX
Spot Speed NEWS
T MEDIA
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in YouTube facebook